ముద్దుగుమ్మల సందర్శన లిస్ట్‌లో కేసీఆర్ ఫలాలు

మిస్ వరల్డ్ కంటెస్టెంట్లు సందర్శించే వాటిలో కేసీఆర్ నిర్మించిన కట్టడాలే అధికం

- జాబితాలో సెక్రటేరియట్, కమాండ్ కంట్రోల్ రూం, టీ హబ్, బుద్ధవనం, యాదగిరిగుట్ట
- తెలంగాణ చరిత్రపై సచివాలయంలోనే అందాల భామలకు ప్రత్యేక కార్యక్రమం
- కేటీఆర్ అమలు చేసిన ట్యాంక్‌బండ్ 'సండే ఫన్‌డే'లో సందడి చేయనున్న సుందరాంగులు

సచివాలయం వద్ద ఏర్పాట్లు

సిటీబ్యూరో, మే 9 (నమస్తే తెలంగాణ) : మిస్ వరల్డ్ కంటెస్టెంట్స్‌కు తెలంగాణ అంటే ఏమిటో చూపించేందుకు కాంగ్రెస్ సర్కార్ ప్రత్యేక కట్టడాలను లిస్ట్ చేసింది. అందులో కేసీఆర్ నిర్మించిన సచివాలయం, ఇంటిగ్రేటెడ్ పోలీస్ కమాండ్ కంట్రోల్ రూం, టీ హబ్, బుద్ధవనం, యాదగిరిగుట్టలనే ప్రధానంగా ఎంపిక చేశారు. వీటిని హైదరాబాద్ అభివృద్ధికి సాక్ష్యంగా చూపించనున్నారు. అంతేకాదు యంగెస్ట్ స్టేట్ తెలంగాణ చరిత్రపై ప్రపంచ ముద్దుగుమ్మలకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలను సైతం సచివాలయంలోనే ఏర్పాటు చేయడం విశేషం. ఆ పక్కనే ఉన్న అతిపెద్ద అంబేద్కర్ విగ్రహం, గతంలో కేటీఆర్ వినూత్న తరహాలో అమలు చేసిన ట్యాంక్‌బండ్ సండే ఫన్‌డేలో సైతం ఈ ముద్దుగుమ్మలు పాల్గొనేలా తెలంగాణ పర్యాటక శాఖ ఏర్పాట్లు చేసింది. మొత్తంగా కేసీఆర్ పాలనలో జరిగిన అభివృద్ధిని ప్రపంచానికి చూపించి.. హైదరాబాద్ అదరహో అనేలా కాంగ్రెస్ సర్కార్ ఆ క్రెడిట్‌ను తమ ఖాతాలో వేసుకోవడానికి తహతహలాడుతున్నది.

నగరంలో ముద్దుగుమ్మల పర్యటన ఇలా

సుమారు 120 దేశాల నుంచి వస్తున్న ముద్దుగుమ్మలను నగరంలోని పలు ప్రతిష్ఠాత్మక కట్టడాలను పరిచయం చేయనున్నారు. 12న నాగార్జున సాగర్‌లో ఉన్న బుద్ధవనం ప్రాజెక్టు, బుద్ధిస్ట్ థీమ్ పార్కును మిస్ కంటెస్టెంట్స్‌లు సందర్శించనున్నారు. అదే రోజు చార్మినార్ వద్ద హెరిటేజ్ వాక్ ఏర్పాటు చేశారు. 13న చౌమహల్లా ప్యాలెస్‌ను సందర్శించి లైవ్ మ్యూజిక్ కాన్సర్ట్‌లో పాల్గొంటారు. మే 15న యాదగిరిగుట్టను సందర్శిస్తారు. 16న ఏఐజీలో మెడికల్ టూరిజం ఈవెంట్‌కు హాజరవుతారు. 17న రామోజీ ఫిల్మ్‌సిటీని సందర్శిస్తారు. 18న తెలంగాణ పోలీస్ ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్, తెలంగాణ సచివాలయాన్ని సందర్శించనున్నారు. ట్యాంక్‌బండ్ వద్ద నిర్వహించే సండే ఫన్‌డే కార్నివాల్‌లో పాల్గొంటారు. సచివాలయంలో అధికారులు మిస్ వరల్డ్ కంటెస్టెంట్‌కు తెలంగాణ రాష్ట్ర గ్రోత్ స్టోరీ, చరిత్రను వివరిస్తారు. 21న శిల్పారామంలో తెలంగాణ కళాకారుల ఆధ్వర్యంలో నిర్వహించే ఆర్ట్స్, క్రాఫ్ట్స్ వర్క్‌షాప్‌లో పాల్గొంటారు. అదే రోజు టీ హబ్‌ను సందర్శించనున్నారు. మే 10 నుంచి ప్రారంభం కానుండగా 31న హైటెక్స్‌లో గ్రాండ్ ఫినాలే జరుగుతుంది.

మురళి మరణం కలిచి వేసింది

పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి

పరిగి/యాలాల/చేవెళ్ల టౌన్, మే 9 : జమ్మూకశ్మీర్‌లో పాకిస్థాన్‌తో జరుగుతున్న యుద్ధంలో వీర మరణం పొందిన భారత సైనికుడు మురళి నాయక్ మరణం మనసును కలిచి వేసిందని పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ..
అతడి మరణం బాధాకరమని.. అతడి కుటుంబానికి మనోధైర్యాన్ని ఇవ్వాలని ఆ భగవంతుడ్ని ప్రార్థిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఇలాంటి సమయంలో ప్రతి ఒక్కరూ ఐక్యంగా సైనికులకు అండగా నిలవాలన్నారు. భారత సైన్యానికి మద్దతుగా మేము సైతం అంటూ శ్రీనివాస్‌రెడ్డి, సరళా రెడ్డి రూ. రెండు లక్షల విరాళం అందించి తమ దాతృత్వాన్ని చాటుకున్నారు. చేవెళ్ల ప్రాంతంలో అక్రమంగా ఉంటున్న పాకిస్థానీయులను గుర్తించి వెంటనే వారి దేశానికి పంపించాలని బీజేపీ చేవెళ్ల మున్సిపల్ అధ్యక్షుడు అనంతరెడ్డి , శంకర్‌గౌడ్ డిమాండ్ చేశారు. శుక్రవారం వారు చేవెళ్లలో విలేకరులతో మాట్లాడారు.

వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్

అర్హులు దరఖాస్తు చేసుకోవాలి

లైసెన్స్‌డ్ సర్వేయర్ల శిక్షణకు

వికారాబాద్, మే 9 : లైసెన్స్‌డ్ సర్వేయర్ల శిక్షణకు అర్హులు ఈ నెల 17 లోపు దరఖాస్తు చేసుకోవాలని వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇంటర్‌లో గణితం (60 శాతం మార్కులు) నుంచి బీటెక్ సివిల్ వరకు అర్హత కలిగిన వారు మీ-సేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఎంపికైన అభ్యర్థులకు జిల్లా ప్రధాన కేంద్రంలో మే 26 నుంచి జూలై 26 వరకు శిక్షణ ఉంటుందన్నారు. ఇందుకు ఓసీ అభ్యర్థులు రూ.10,000, బీసీలు రూ. 5,000, ఎస్సీ, ఎస్టీలు రూ.2,500 ఫీజుగా చెల్లించాల్సి ఉంటుందన్నారు. దివ్యాంగులు స్లాట్ బుక్ చేసుకున్న మెసేజ్ ప్రకారం క్యాంపులకు హాజరు కావాలన్నారు. జిల్లాలోని సదరం/యూడీఐడీ ద్వారా మేలో వివిధ వైకల్యం లోపం ఉన్న వారికి వికారాబాద్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో పరీక్షలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈనెల 13, 16, 21 తేదీల్లో అంగవైకల్యం కలవారు, 23న చెవుడు, మూగ, 27న అంధులు, తక్కువ చూపు కలవారు, 29వన బుద్ధిమాంద్యం/మానసిక వైకల్యం గల వారికి సదరం/యూడీఐడీ ద్వారా క్యాంపులు ఉంటాయన్నారు.

ధాన్యాన్ని రైస్‌మిల్లులకు పంపించాలి

రైతుల నుంచి సేకరించిన ధాన్యాన్ని త్వరగా రైస్‌మిల్లులకు పంపించాలని వికారాబాద్ అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ సూచించారు. శుక్రవారం మండలంలోని సుల్తాన్‌పూర్ గ్రామంలో డీసీఎంఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన తనిఖీ చేసి.. రైతుల నుంచి సేకరించిన ధాన్యాన్ని రైస్ మిల్లులకు తరలించాలని కేంద్రం నిర్వాహకులను సూచించారు. జిల్లాలో 128 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో డీఎస్‌వో మోహన్‌బాబు, డీఎం మోహన్‌కృష్ణ తదితరులు పాల్గొన్నారు. -పరిగి, మే 9

అధ్వానంగా నీటి తొట్లు..

మర్పల్లి, మే 9 : మూగజీవాలకు తాగునీరందించేందుకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన నీటితొట్టెలు అధికారుల నిర్లక్ష్యం, పర్యవేక్షణ కొరవడడంతో అపరిశుభ్రంగా మారుతున్నాయి. మండలంలోని దామస్తాపూర్ తండాలో ఓవర్ హెడ్ ట్యాంక్ వద్ద నిర్మించిన తొట్టెలోని నీరు పూర్తిగా నాచుతో పేరుకుపోయి అపరిశుభ్రంగా మారింది. ఆ నీటిని పశువులు తాగితే రోగాల బారిన పడడం ఖాయమని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎండాకాలం సందర్భంగా మూగజీవాల దాహార్తిని తీర్చేందుకు పలు గ్రామాల్లోని తొట్టెలను శుభ్రం చేయించి..నీటితో నింపాలని కోరుతున్నారు.

దామస్తాపూర్ తండాలో నాచుతో నిండిన నీటి తొట్టె

షాపూర్‌తండాలో నిరుపయోగంగా ఉన్న నీటి తొట్టె..

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన బోధన

వికారాబాద్ డీఈవో రేణుకాదేవి

బొంరాస్‌పేట : ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు నాణ్యమైన బోధన అందుతుందని.. తల్లిదండ్రులు తమ పిల్లలను సర్కారు బడుల్లోనే చేర్పించాలని వికారాబాద్ డీఈవో రేణుకాదేవి అన్నారు. శుక్రవారం ఆమె దుద్యాల మండలం చిల్‌ముల్ మైల్వార్‌లోని వేసవి శిక్షణా శిబిరాన్ని సందర్శించి.. విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడారు. ప్రభుత్వ బడుల్లో శిక్షణ పొందిన ఉపాధ్యాయులుంటారని.. అంతేకాకుండా ప్రభుత్వం బుక్స్, నోట్‌బుక్స్, యూనిఫామ్‌లను సమకూర్చుతుందన్నారు.

ఒక్క పక్క యుద్ధం జరుగుతుంటే..

అందాల పోటీలా..?

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ

ఇబ్రహీంపట్నంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ

ఇబ్రహీంపట్నం, మే 9 : ఒక పక్క భారత్-పాక్ మధ్య యుద్ధం కొనసాగుతుంటే రాష్ట్రంలో అందాల పోటీలు అవసరమా అని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. రాష్ట్ర సర్కార్ వెంటనే ఆ పోటీలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. శుక్రవారం ఇబ్రహీంపట్నంలోని పాషా, నరహరి స్మారక కేంద్రంలో సెమినార్ జరిగింది. దీనికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ.. హిట్లర్ సామ్రాజ్యవాదాన్ని మట్టి కరిపించి రష్యా తమ దేశంలో ఎర్రజెండాను ఎగరవేసిందన్నారు. నియంత హిట్లర్ ప్రపంచంలోని ఒక్కో దేశాన్ని ఆక్రమించుకుంటూ రష్యాను కూడా ఆక్రమించుకునేందుకు చేసిన ప్రయత్నాన్ని 1945లో సోవియట్ యూనియన్ కమ్యూనిస్టు పార్టీల ఎర్రసైన్యం అడ్డుకుందని..హిట్లర్‌ను ఓడించిందన్నారు. ఈ తరుణంలో 8 గంటల పని విధానం కోసం ఎర్రజెండా నాయకత్వంలో ప్రజలు కోట్లాడి సాధించుకున్న హక్కులను ప్రస్తుత మోదీ ప్రభుత్వం కాలరాస్తూ.. మళ్లీ 12 గంటల పని విధానాన్ని తీసుకురావాలని చూస్తున్నదన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయడంలేదని ఆరోపించారు. రాష్ట్రం దివాలా తీసిందని చెప్తున్న సీఎం రేవంత్‌రెడ్డికి మతిభ్రమించిందన్నారు. పాక్ ఉగ్రవాద చర్యలను సీపీఎం ఖండిస్తుందన్నారు.

దేశవ్యాప్త సమ్మెకు మద్దతు..

ఈనెల 20న చేపట్టనున్న దేశవ్యాప్త సమ్మెకు సీపీఎం సంపూర్ణ మద్దతు ప్రకటిస్తుందని జాన్‌వెస్లీ స్పష్టం చేశారు. అదే విధంగా ఈ నెల 30న రాష్ట్రంలోని అన్ని కలెక్టరేట్ల ఎదుట వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో చేపట్టే ధర్నాలకూ మద్దతు ప్రకటిస్తుందన్నారు. రైతులు, కార్మికులు ఈ ఆందోళన కార్యక్రమాల్లో పాల్గొని సక్సెస్ చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య, నాయకులు కాడిగల్ల బాస్కర్ సామెల్, నర్సింహ, జగన్, చంద్రమోహన్, నర్సింహ, శ్యామ్ సుందర్, నర్సిరెడ్డి, కిషన్, నర్సింహ, జగన్, సుమలత, ఎల్లేశ్ తదితరులున్నారు.

క్రీడాకారుల్లో నైపుణ్యాన్ని పెంపొందించాలి

అడిషనల్ కమిషనర్ యాదగిరి రావు

సిటీబ్యూరో, మే 9 (నమస్తే తెలంగాణ): సమ్మర్ కోచింగ్ క్యాంపుల ద్వారా క్రీడాకారుల్లో నైపుణ్యాన్ని పెంపొందించాలని అడిషనల్ కమిషనర్ యాదగిరిరావు సంబంధిత కోచ్‌లను ఆదేశించారు. శుక్రవారం సికింద్రాబాద్ జోన్‌లోని వివిధ ప్లే గ్రౌండ్‌లు, స్విమ్మింగ్‌పూల్స్‌ను సంబంధిత జోన్ గేమ్స్ ఇన్‌స్పెక్టర్‌తో కలిసి పరిశీలించారు. జీహెచ్ఎంసీ సమ్మర్ కోచింగ్ క్యాంపులకు మంచి స్పందన లభిస్తుందని, గ్రేటర్ వ్యాప్తంగా ప్రతి సంవత్సరం ఆరు నుంచి 16 సంవత్సరాల పిల్లలకు క్రీడా నైపుణ్యాన్ని పెంపొందించేందుకు సమ్మర్ కోచింగ్ క్యాంపులను నిర్వహిస్తున్నామన్నారు.
ఈ సంవత్సరం ఆరు జోన్లలో వివిధ క్రీడా విభాగాల్లో నిష్ణాతులైన 77 మంది పార్ట్ టైం కోచ్‌లు, 800 మంది గౌరవ వేతన కోచ్‌ల ద్వారా సమ్మర్ కోచింగ్ క్యాంపులను ఏర్పాటు చేశామన్నారు. 44 విశాలమైన బహుళ క్రీడా సముదాయాలు, 29 స్విమ్మింగ్ పూల్స్, 13 ఆట స్థలాలు, స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లలో 44 రకాల క్రీడల్లో శిక్షణ ఇస్తున్నట్లు ఆయన వివరించారు.

జవహర్‌నగర్‌లో కార్మికుల మరణం బాధాకరం..

ఒక్కో బాధిత కుటుంబానికి రూ.15 లక్షల పరిహారం

సిటీబ్యూరో, మే 9 (నమస్తే తెలంగాణ): జవహర్‌నగర్‌లో జరిగిన ప్రమాదంలో ముగ్గురు కార్మికులు ప్రాణాలు కోల్పోవడంతో మేయర్ గద్వాల్ విజయలక్ష్మి విచారం వ్యక్తం చేశారు. ఈ ప్రమాదంపై శుక్రవారం శానిటేషన్ అధికారులు, రాంకీ యాజమాన్యంతో మేయర్ సమీక్షించారు. ఈ సందర్భంగా రాంకీ యాజమాన్యం ప్రమాద కారణాలను మేయర్‌కు వివరించడంతో పాటు భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా జాగ్రత్తలు తీసుకుంటామని తెలిపి.. పబ్లిక్ వర్క్స్ కాంట్రాక్ట్ నిబంధనల మేరకు ఒక్కో బాధిత కుటుంబానికి రూ.15 లక్షల పరిహారం అందజేయనున్నట్లు ప్రకటించారు. మొదటి విడతగా ఒక్కొక్కరికి రూ. 4 లక్షల పరిహారం శుక్రవారం అందజేస్తున్నామన్నారు. ఈ సమావేశంలో శానిటేషన్ అడిషనల్ కమిషనర్ రఘు ప్రసాద్, రాంకీ ప్రాజెక్టు డైరెక్టర్ అగర్వాల్ పాల్గొన్నారు.

నేటి నుంచి మిస్ వరల్డ్

సిటీబ్యూరో, మే 9 (నమస్తే తెలంగాణ) : ప్రపంచ అందాల పోటీల ప్రారంభోత్సవం గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో శనివారం సాయంత్రం అట్టహాసంగా జరగనున్నది. సంస్కృతీ, సౌందర్యం రెండింటి మేళవింపుగా నిర్వహించనున్న మిస్ వరల్డ్-2025 ఉత్సవాలను తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసింది. తెలంగాణకు చెందిన వివిధ రకాల జానపద, గిరిజన, శాస్త్రీయ కళలు, హైదరాబాదీ దక్కన్ కళారూపాలను ఈ ఉత్సవాల్లో ప్రదర్శించనున్నారు. మొదట తెలంగాణ రాష్ట్ర గీతం ఆలాపనతో కార్యక్రమం ప్రారంభమవుతుంది. ఈ పాటను ప్రముఖ గాయకుడు రామాచారి శిష్య బృందం ఆలపిస్తుంది. ఆ తర్వాత పేరిణి నాట్య ప్రదర్శన అత్యంత వైభవంగా జరగనున్నది. 250 మంది మహిళా కళాకారిణులు పేరిణి లాస్య సంప్రదాయాన్ని అనుసరించి ఈ నృత్యరూపకం ఉంటుంది. అనంతరం కళాకారులంతా నక్షత్రం, సీతాకోకచిలుక, మిస్ వరల్డ్ లోగో ఆకృతుల్లో ప్రదర్శన ఇవ్వనున్నారు.
ఆ తర్వాత ప్రపంచ దేశాల నుంచి విచ్చేసిన సుందరీమణుల పరిచయ కార్యక్రమానికి ప్రారంభ సూచికగా..ఖండాల వారీగా తెలంగాణ జానపద, గిరిజన కళారూపాల ప్రదర్శనలుంటాయి. వాటిలో భద్రాచలం గోదావరి పరివాహక ప్రాంతానికి పట్టుగొమ్మగా నిలిచిన కొమ్ము కోయ కళాకారులు శ్రీ రామకృష్ణ బృందం ప్రదర్శన ఉంటుంది. ఆ తర్వాత ఆదిలాబాద్ ప్రాంతం నుంచి గోండు జాతి ప్రజల విశిష్ట కళారూపం గుస్సాడీ కళా ప్రదర్శనతో సుందరీమణులు వేదికకి పరిచయమవుతారు. అలాగే తెలంగాణ జానపద సంప్రదాయానికి నిలువెత్తు నిర్వచనంగా నిలిచే డప్పులు ఉస్తాద్ బిస్మిల్లా ఖాన్ యువ పురస్కార గ్రహీత అందే భాస్కర్ బృందంతో, తెలంగాణ గిరిజన వైభవానికి ప్రతీకగా నిలిచే బంజారా మహిళల విన్యాసాలు స్వప్న బృందంతో, తెలంగాణ గ్రామీణ పల్లె జీవన ప్రతీకగా నిలిచిన ఒగ్గు డోలు కళా విన్యాసాలు ఉస్తాద్ బిస్మిల్లాఖాన్ యువ పురస్కార గ్రహీత చౌదరపల్లి రవి కుమార్ బృందంతో ప్రదర్శనలు ఉంటాయి. కాగా, అందాల పోటీల నేపథ్యంలో గచ్చిబౌలి స్టేడియంలో జరుగుతున్న ఏర్పాట్లను జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్ వీ కర్ణన్ శుక్రవారం అధికారులతో కలిసి పరిశీలించారు.

దవాఖానలపై రెడ్‌క్రాస్

సిటీబ్యూరో, మే 9 (నమస్తే తెలంగాణ): భారత్-పాక్ మధ్య నెలకొన్న యుద్ధ వాతావరణం నేపథ్యంలో వైద్య, ఆరోగ్యశాఖను ప్రభుత్వం అప్రమత్తం చేసింది. ముందస్తు జాగ్రత్త చర్యగా 100 లేదా అంతకంటే ఎక్కువ పడకల సామర్థ్యం ఉన్న అన్ని ప్రభుత్వ దవాఖానల పైకప్పులపై ఎరుపు రంగుతో ప్లస్ గుర్తు స్పష్టంగా కనిపించేలా పెయింట్ చేయాలని ఆదేశించింది. ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 164 వైద్యశాలల్లో ఈ ప్రక్రియ చేపట్టినట్లు డీఎంఈ డాక్టర్ నరేంద్రకుమార్ తెలిపారు. హైదరాబాద్ పరిధిలో 15, రంగారెడ్డి జిల్లా పరిధిలో 9, మేడ్చల్ పరిధిలో ఉన్న మొత్తం దవాఖానల పైకప్పులపై 'రెడ్‌క్రాస్ మార్క్' వేసినట్లు అధికారులు వెల్లడించారు.

ఈ ప్లస్ గుర్తు ఎందుకు..?

ప్రపంచంలో ఎక్కడైనా యుద్ధాలు జరిగినప్పుడు జనివా 1949 ఒప్పందం ప్రకారం.. హాస్పిటల్స్, వైద్యసిబ్బంది, రోగులపై దాడులు చేయడం నిషేధం. అందుకని యుద్ధాలు జరిగే సమయంలో హాస్పిటళ్లను సులభంగా గుర్తించేందుకు వాటి పై కప్పులపై స్పష్టంగా కనిపించేలా ఎరుపు రంగుతో ప్లస్ గుర్తును ఏర్పాటు చేస్తారు. దీని వల్ల దాడులు చేసే వారు ఆ గుర్తు ఉన్న భవనాల జోలికి వెళ్లరు. ప్రస్తుతం భారత్-పాక్ మధ్య నెలకొన్న యుద్ధ వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో ముందు జాగ్రత్త చర్యగా రాష్ట్రంలోని ప్రభుత్వ దవాఖానల స్లాబ్‌లపై 12*12 పరిమాణంలో ఎరుపు రంగుతో కూడిన ప్లస్ గుర్తు వేశారు. ఇది ఎంత దూరం నుంచి అయినా స్పష్టంగా కనిపించడం వల్ల దాడుల నుంచి దవాఖానలకు రక్షణ కల్పించే అవకాశముంటుంది.

వంటావార్పుతో నిరసన

హఫీజ్‌పేటలోని జనప్రియ నగర్ ఫేస్- 5లో స్థానిక ప్లాట్ యాజమానులు శేరిలింగంపల్లి జోనల్ కార్యాలయంతో పాటు చందానగర్ టౌన్ ప్లానింగ్ అధికారుల నిర్లక్ష్య వైఖరికి నిరసనగా రెండు రోజులుగా నిరసన దీక్ష చేపట్టారు. శుక్రవారం నిరసన దీక్ష లో భాగంగా వంటావార్పు కార్యక్రమాన్ని చేపట్టారు. -మాదాపూర్, మే 9